పురాతన ఆలయాల అభివృద్ధికి నిధులు కేటాయించాలి


గాజుల అంజయ్యను సన్మానిస్తున్న పోచమ్మ ఆలయ కమిటీ ప్రతినిధులు

చార్మినార్: పాతబస్తీలోని పురాతన ఆలయాల పరిరక్షణకు రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. చంచల్‌గూడలోని కాలాడేరాలో పురాతన పోచమ్మ ఆలయ పునర్ నిర్మాణం పనులు పూర్తి కావడంతో సోమవారం హంపీ పీఠాధిపతి విరూపాక్ష విద్యారణ్య భారతి స్వామి చేతుల మీదుగా విగ్రహాల ప్రాణ ప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. పోచమ్మ ఆలయ ప్రాంగణంలో శివాలయం, ఆంజనేయ స్వామి, గణపతి స్వామి, నవగ్రహాలు కొలువుదీరి ఉన్నాయి. ఈ కార్యక్రమానికి హాజరైన గాజుల అంజయ్యను ఆలయ కమిటీ ప్రతినిధులు కొత్త రఘు, కొత్త శ్రీనివాస్, కొత్త నాగు తదితరులు సత్కరించారు. ఆయన మాట్లాడుతూ.. 400 ఏళ్లకు పైగా పాతబస్తీలో చారిత్రాత్మకమైన పురాతన ఆలయాలు న్నాయన్నారు. ఇందులో కొన్ని ఇప్పటికీ దూప, దీప నైవేద్యాలకు నోచుకోవడం లేదని..అలాంటి దేవాలయాల అభివృద్ధికి దేవాదాయ శాఖ దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రసాద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులు ఉన్నత విద్యాభ్యాసం చేయాలి


వేడుకల్లో కేతావత్ సోమలాల్ నాయక్ తదితరులు

చార్మినార్: పేద విద్యార్థులు ఉన్నత విద్యాభ్యాసం చేస్తేనే జీవితంలో ఆశించిన ఫలితాలు సాధిస్తారని పద్మశ్రీ అవార్డు గ్రహీత కేతావత్ సోమలాల్ నాయక్ అన్నారు. సేవాలాల్ మహరాజ్ 285 జయంతి వేడుకలు సోమవారం సిటీ కాలేజీలో ఘనంగా జరిగాయి. కేతావత్ సోమలాల్ నాయక్, ఇన్‌కం టాక్స్ కమిషనర్ జీవన్ లాల్ తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరై సేవాలాల్ మహరాజ్ సేవలను కొనియాడారు. ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. డాక్టర్ ఏలూరు యాదయ్య కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థులు తమ విలువైన కాలాన్ని వృథా చేసుకోకుండా ఉన్నత విద్యాభ్యాసం వైపు దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ తిరుపతి, డాక్టర్ సుజాత, డాక్టర్ భాస్కర్, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ రత్న ప్రభాకర్‌లతో పాటు సబావత్ కల్యాణ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు


పనులను పరిశీలించిన ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్

యాకుత్‌పురా: సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అన్నారు. సోమవారం నియోజకవర్గంలో యాకుత్‌పురా, రెయిన్‌బజార్, ఎస్ఆర్టీ కాలనీ, కుర్మాగూడ, మదీనానగర్, తలాబ్‌కట్టా తదితర ప్రాంతాల్లో ఆయన రెయిన్‌బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్‌తో కలిసి పర్యటించారు. రెయిన్‌బజార్ మార్నింగ్ స్టార్ హోటల్ ప్రాంతంలో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..నియోజకవర్గంలోని బస్తీల్లో పర్యటిస్తూ స్థానిక ప్రజా సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గుంతలమయంగా మారిన ప్రధాన రోడ్లు అభివృద్ధి చేసేందుకు ఓ ప్రణాళికతో ముందుకెళ్తున్నామని ఆయన తెలిపారు.



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

శాస్త్రీయ సంగీత కళలపై చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. నృత్య గురువు

గన్‌ఫౌండ్రీ: ప్రముఖ నృత్య శిక్షణాలయం నర్తనం నాట్య కళాశాల మొదటి వార్షికోత్సవ వేడుకలను సోమవారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భరతనాట్యం, వర్షిణి ఆర్ష ఆధ్వర్యంలో సంస్థ చిన్నారుల నృత్యం ప్రేక్షకులను సమ్మోహన పరిచింది. ఈ కార్యక్రమానికి పలువురు నాట్యగురువులు హాజరై చిన్నారులను అభినందించారు.

మేరు కులస్తుల సమస్యలు పరిష్కరించండి


పొన్నం ప్రభాకర్‌ను సత్కరిస్తున్న పోల్కం శ్రీనివాస్

అబిడ్స్: మేరు కులస్తుల దీర్ఘకాల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్, మేరు యువజన సంఘం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల చైర్మన్ పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. నగర ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆయన సన్మానించి మెమొరాండం అందజేశారు. ఈ సందర్భంగా పోల్కం శ్రీనివాస్ మాట్లాడుతూ..మేరు కులస్తులకు తహసీల్దార్‌లు జారీ చేసే కుల ధ్రువపత్రాలలో మేరు పదం ఉండడం లేదన్నారు. మేరు కులస్తులైన తమకు కుల ధ్రువీకరణ పత్రాల్లో మేరు కులం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. మేరు కులస్తులను బీసీ–డీ గ్రూప్ నుంచి బీసీ–ఏ గ్రూప్‌లోకి మార్చాలని పేర్కొన్నారు. కుట్టు మెషీన్లతో జీవనం గడిపే మేరు కులస్తులకు రాష్ట్ర వ్యాప్తంగా ఉచితంగా కుట్టు మెషీన్లు ఇవ్వాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఆదిమూలం శంకర్, దశరత్, గోపాల్‌రెడ్డి, పోల్కం వినయ్ రాజ్, మునగాల రమేష్ పాల్గొన్నారు.

పబ్లిక్‌గార్డెన్‌లో సుందరీకరణ పనులు చేపట్టాలి


టీపీసీసీ కార్యదర్శి మణిలాల్ షాకు లేఖను అందజేస్తున్న అబిద్ అలీ

నాంపల్లి: పబ్లిక్‌గార్డెన్ పరిరక్షణకు తక్షణమే చర్యలు చేపట్టాలని, పార్కును అన్ని విధాలుగా సుందరీకరించి వాకర్స్‌కు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని వయోవృద్ధులు, పబ్లిక్ గార్డెన్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు సీఎం రేవంత్‌రెడ్డికి లేఖను రాశారు. ఈ లేఖను సోమవారం పబ్లిక్‌గార్డెన్‌లో టీపీసీసీ కార్యదర్శి మణిలాల్ షాకు అందజేశారు. ఈ సందర్భంగా పర్యావరణ వేత్త, సామాజిక కార్యకర్త అబిద్ అలీ మాట్లాడుతూ.. పార్కులో పోకిరీల బెడద ఎక్కువైందన్నారు. వాకర్స్‌కు సరైన మౌలిక వసతులు లేకుండా పోయాయని ఫిర్యాదులో పేర్కొన్నట్లు వివరించారు. పార్కును సుందరంగా తీర్చిదిద్ది సందర్శకులకు, వాకర్స్‌కు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించే విధంగా అభివృద్ధి పనులు చేపట్టాలని లేఖలో కోరినట్లు తెలిపారు. పార్కులోనికి ప్రైవేట్ పాఠశాలల బస్సుల ప్రవేశం లేకుండా చూడాలని, పార్కును ప్రైవేట్ బస్సుల పార్కింగ్ స్థలంగా మార్చేశారని, ఈ విషయమై ఉద్యానవన శాఖ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. పార్కులో ప్రైవేట్ బస్సుల పార్కింగ్‌కు అనుమతి ఇచ్చిన ఉద్యానవన శాఖ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, చారిత్రాత్మకమైన వైఎస్సార్ స్టేట్ మ్యూజియం కాలుష్యం కాటుకు గురికాకుండా చూడాలని విజ్ఞప్తి చేసినట్లు అబిద్ అలీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తవక్కల్ గ్రూపు అధినేత సర్వర్ పాషా, జాకబ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ఎంసీ సభ్యులకు సత్కారం



డాక్టర్ తఖియుద్దీన్‌ను సత్కరిస్తున్న దృశ్యం

నాంపల్లి: ఇటీవల నియమితులైన తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్(టీఎస్ఎంసీ) సభ్యులకు రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్ కేఎల్ఎన్ ప్రసాద్ ఆడిటోరియంలో సత్కారం జరిగింది. ఇక్రా గ్రూప్ ఆఫ్ డాక్టర్స్–హైదరాబాద్, డాక్టర్స్ అసోసియేషన్ ఫర్ రిలీఫ్ అండ్ ఎడ్యుకేషన్ (డీఏఆర్ఈ), దక్కన్ అల్యూమిని అసోసియేషన్ (డీఏఏ) సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టారు. టీఎస్ఎంసీ అధ్యక్షుడు డాక్టర్ మహేష్ అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్యఅతిథిగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఉమర్ జలీల్ హాజరై ప్రసంగించారు. పేదలకు సేవ చేయాలనే సంకల్పం కలిగిన విద్యార్థులు వైద్య రంగంలోకి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తఖియుద్దీన్ ఖాన్, డీఏఆర్ఈ నగర అధ్యక్షుడు డాక్టర్ అతీఖ్ ఉర్ రెహమాన్, ఉస్మానియా మెడికల్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ తాంజిల్ మున్వర్, డీఏఏ అధ్యక్షుడు డాక్టర్ మాజిద్ ఆదిల్, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ ఫెయిమిదా భాను పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీఎస్ఎంసీ సభ్యులు డాక్టర్ ఇమ్రాన్, డాక్టర్ జి.శ్రీనివాస్, డాక్టర్ ప్రతిభాలక్ష్మి, సన్నీడెవిస్‌లను సత్కరించారు.

స్ఫూర్తి ప్రదాత శివాజీ మహరాజ్

ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి వేడుకలను అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ నాయకులు శివాజీ మహరాజ్ చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఛత్రపతి శివాజీ మహరాజ్ సేవాదళ్ ఆధ్వర్యంలో మహా శోభాయాత్ర వైభవంగా కొనసాగింది. పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.
– అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల బృందం


నివాళులర్పిస్తున్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ తదితరులు


ఉత్సవాల్లో బజరంగ్ సేనా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఆర్.లక్ష్మణ్‌రావు తదితరులు


నివాళులర్పిస్తున్న మనోహర్ గైక్వాడ్, ఇందిరానగర్ అధ్యక్షుడు రామకృష్ణ


ర్యాలీలో కేడి.ధినేష్, సోమ శేఖర్


గౌలిపురా పటేల్‌నగర్‌లో..


వేడుకల్లో గ్రేటర్ బీజేపీ నాయకులు లడ్డు యాదవ్, ముక్కా కృష్ణాగుప్తా


ఛత్రపతి శివాజీ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న సిటీ కాలేజీ విద్యార్థులు


గుడిమల్కాపూర్‌లో.. బీజేపీ నాయకులు


వేడుకల్లో బీజేపీ నాయకుడు దేవర వంశీ తదితరులు


ఊరేగింపులో బీజేపీ ఇన్‌చార్జ్ అమర్‌సింగ్, మిత్రకృష్ణ, శంకర్, చంద్రకాంత్, విశాల్ సింగ్


ఛత్రపతి శివాజీ మహరాజ్ సేవాదళ్.. మహా శోభాయాత్రలో ప్రతినిధులు


ఆసిఫ్‌నగర్ శంకర్‌నగర్‌లో..


నివాళులర్పిస్తున్న క్రాంతికుమార్ తదితరులు

మేడారం జాతరకు 2 లక్షల మాస్కుల వితరణ



మాస్కులను, ఇతర మెడికల్ కిట్లను మంత్రి సీతక్కకు అందజేస్తున్న ఐఎంఏ రాష్ట్ర శాఖ ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో మేడారం మహా జాతర సందర్భంగా మంత్రి సీతక్క సమక్షంలో కలెక్టర్, రెవెన్యూ శాఖ అధికారులు, పోలీస్ సిబ్బంది, పాత్రికేయులకు అవసరమైన రెండు లక్షల మాస్కులు అందించడం జరిగిందని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ కాళీప్రసాద్, డాక్టర్ విజయ్‌రావు తెలిపారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వరంగల్ శాఖ ఆధ్వర్యంలో ఆసుపత్రిలో అవసరమైన 50 వేల ప్రిస్కిప్షన్ ప్యాడ్స్ అందజేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ..భక్తులు జాతరలో తప్పకుండా మాస్కులు ధరించి తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. అదేవిధంగా అధికారులు భక్తుల ఆరోగ్యానికి అవసరమైన అన్నిరకాల చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ డాక్టర్ శబరీష్, డాక్టర్ రాజేందర్ కుమార్ యాదవ్, ములుగు డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య, ఐఎంఏ వరంగల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ మహ్మద్ అన్వర్, డాక్టర్ బింగి శ్రీనివాస్‌లతో పాటు అధికారులు పాల్గొన్నారు.

ఈ-పెట్టీ కేసులో యువకుడికి జైలు


శ్రావణ అభినవ్

అబిడ్స్: ఈవ్‌టీజర్‌కు 3వ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఐదురోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పుచెప్పారు. అబిడ్స్ ఇన్‌స్పెక్టర్ నర్సింహారాజు తెలిపిన వివరాల ప్రకారం..అబిడ్స్ చిరాగ్ గల్లీలో నివసించే శ్రావణ అభినవ్(23) మద్యం సేవించి మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. ఈవ్‌టీజింగ్ చేస్తున్న అతనిపై ఈ–పెట్టీ కేసును నమోదు చేయగా న్యాయమూర్తి ఐదు రోజులు జైలు శిక్ష విధించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. సాయంత్రం, ఉదయం వేళల్లో బస్టాప్‌లు, కాలేజీల పరిసరాల్లో మఫ్టీలో పోలీసు ఉండి ఎవరైనా ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే వారిపై కఠినంగా వ్యవహరిస్తున్నామని హెచ్చరించారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

నాంపల్లి: శతాబ్ది ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన నాంపల్లి జీఆర్పీ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలోని హైటెక్‌సిటీ–బోరబండ రైల్వే స్టేషన్ల మధ్యలో చోటుచేసుకుంది. సుమారు 55 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి ఆదివారం హైటెక్‌సిటీ–బోరబండ రైల్వేస్టేషన్ల మధ్యలో రైలు పట్టాలు దాటుతుండగా అటుగా వచ్చిన శతాబ్ది ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


నాంపల్లి: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన మాసబ్‌ట్యాంక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ చంద గంగాధర్ తెలిపిన వివరాల ప్రకారం..టోమలగూడకు చెందిన రంగ కుమారుడు గుగులోతు చరణ్(20) క్యాబ్ డ్రైవర్. సోమవారం మధ్యాహ్నం 4.30 గంటలకు తన బైక్‌పైన బావమర్ధితో కలిసి మాసబ్‌ట్యాంక్‌కు వచ్చారు. పని ముగించుకుని తిరిగి ఇంటికి వెళ్తుండగా మహవీర్ ఆసుపత్రి వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఓ ఆటో ఢీకొట్టిన ఘటనలో చరణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని పక్కనే ఉన్న మహవీర్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బల్వంత్‌రాయ్ సేవలు ఎనలేనివి


నివాళులర్పిస్తున్న వీరాంజనేయులు తదితరులు

గన్‌ఫౌండ్రీ: భారతదేశ పంచాయతీరాజ్ సంస్కరణల పితామహుడు బల్వంత్‌రాయ్ మెహతాను స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు ఆదర్శంగా తీసుకోవాలని అఖిల భారత పంచాయతి పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు అన్నారు. సోమవారం అబిడ్స్‌లోని మాతృదేవోభవ కార్యాలయంలో మరాఠ యోధుడు ఛత్రపతి శివాజీ, బల్వంతరాయ్ మెహతా 125వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పంచాయతీరాజ్ చట్టంలో అనేక సంస్కరణలు చేసి దేశానికి విశేష సేవలందించిన బల్వంత్‌రాయ్‌ని కేంద్ర ప్రభుత్వం సముచిత స్థానంతో గౌరవించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాతృదేవోభవ సత్సంగ్ జాతీయ అధ్యక్షులు కేబీ.శ్రీధర్, ప్రతినిధులు డాక్టర్ లక్ష్మి, నందమూరి ప్రసాద్, దేవసేన, పుష్పాంజలి, నవీన్, బాలాజీ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలి


సౌత్ వెస్ట్ జోన్ డీసీపీతో షానవాజ్‌ఖాన్

గోల్కొండ: వ్యాపారులతో పాటు సాధారణ పౌరులు సైతం నిబంధనలను పాటించాల్సిందేనని సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం గోల్కొండ, ఎండిలైన్స్ తదితర ప్రాంతాలకు చెందిన వారితో పాటు పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులు మెహిదీపట్నంలోని డీసీపీ కార్యాలయంలో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులు షానవాజ్‌ఖాన్ డీసీపీకి బొకే అందించి సౌత్ వెస్ట్ జోన్ డీసీపీగా నియమితులైనందుకు అభినందించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణ కోసమే పోలీసులు నిబంధనలు విధిస్తారని రాత్రి పూట స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతోనే రెస్టారెంట్లు, షాపులు మూసివేస్తున్నామన్నారు. ఆజామ్‌ఖాన్, ఇలియాస్ అక్బల్ అలీ, తహసీన్‌పాషా తదితరులున్నారు.

'ఆసాన్ నిఖా' కరపత్రం ఆవిష్కరణ


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ముస్లిం సమాజంలో పెళ్లిళ్లను ఆర్భాటంగా చేయడం ఆచారంగా మారిందని.. ఇది ముస్లిం మత గ్రంథాలకు విరుద్ధమని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. గోల్కొండ జోన్ సదర్‌ఖాజీ అలీముద్దీన్ రూపొందించిన 'ఆసాన్ నిఖా' కరపత్రాన్ని సోమవారం ఆయన టోలిచౌకిలోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సులభతర పెళ్లి అనే శీర్షికతో సదర్ ఖాజీ అలీముద్దీన్ ఎంతో ధైర్యంగా ఆసాన్ నిఖా పేరిట ప్రచారం నిర్వహించడానికి ముందుకు రావడం ఆయన వృత్తిధర్మంలోని నిజాయితీకి నిదర్శనమన్నారు. గోల్కొండ జోన్ సదర్ ఖాజీ అలీముద్దీన్ మాట్లాడుతూ.. ఖాజీగా తన పదవి కాలంలో ఎన్నో క్లిష్టతరమైన పెళ్లిళ్లను సులభం చేశానన్నారు. సులభంగా పెళ్లి అనే నినాదంతో తాను ప్రారంభిస్తున్న ఈ కార్యక్రమానికి అన్ని వర్గాల ప్రజలు మద్దతు ఇస్తారని తాను ఆశిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, సయ్యద్ జబ్బార్, హబీబ్ చాహుష్, అలీమ్, మీర్జా ఎక్బాల్ అహ్మద్ తదితరులున్నారు.

నాంపల్లిలో జీహెచ్ఎంసీ కమిషనర్ పర్యటన


ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్‌తో కలిసి పర్యటిస్తున్న రొనాల్డ్ రాస్

నాంపల్లి: జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ నాంపల్లి నియోజకవర్గంలో సోమవారం ఉదయం ఆకస్మిక పర్యటన చేశారు. నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్‌తో కలిసి ఆయన పలు ప్రాంతాల్లో కలియతిరిగారు. ఇటీవల పారిశుద్ధ్య నిర్వహణ లోపంపై కమిషనర్‌కు అనేక ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో కమిషనర్ ఎవరికి సమాచారం ఇవ్వకుండానే నియోజకవర్గంలోని పలు డివిజన్లను సందర్శించారు. ఆయా డివిజన్లలో గుట్టలుగా చెత్తపేరుకుపోవడం చూసి కమిషనర్ అవాక్కయ్యారు. చెత్త తరలింపులో జరుగుతున్న జాప్యంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సకాలంలో పారిశుద్ధ్య పనులను చేపట్టకపోతే కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

నియామకం


జగ్జీవన్

చార్మినార్: బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడిగా సీనియర్ బీజేపీ యువ నాయకుడు జి.జగ్జీవన్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ నూతన కార్యవర్గాన్ని ప్రకటించినట్లు జగ్జీవన్ తెలిపారు. ఇప్పటి వరకు హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బీజేపీ ఇన్‌చార్జిగా పని చేస్తున్న తనకు రాష్ట్ర ఉపాధ్యక్షుడి బాధ్యతలు అప్పగించడంపై పార్టీ అధిష్టానానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు.

బాధ్యతల స్వీకరణ


మహిపాల్‌ను సత్కరిస్తున్న సత్యనారాయణ

నాంపల్లి: హైదరాబాద్ రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్‌గా (ఆర్డీఓ) కె.మహిపాల్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఆర్డీఓగా పనిచేసిన సూర్య ప్రకాష్ యూఎల్‌సీకి బదిలీపై వెళ్లారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జరిగిన బదిలీల్లో భాగంగా వీరికి స్థానచలనం జరిగింది. సోమవారం విధుల్లో చేరిన మహిపాల్‌కు తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు వర్కల సత్యనారాయణ స్వాగతం పలికారు. అలాగే హైదరాబాద్ ఆర్డీఓగా పనిచేసి అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యూఎల్‌సీ) విభాగానికి వెళ్లిన సూర్య ప్రకాష్‌కు ఘనంగా వీడ్కోలు పలికారు.

కనుల పండువగా శివపార్వతుల కల్యాణం


కల్యాణ మహోత్సవంలో బీజేపీ నాయకులు సునీల్‌యాదవ్ తదితరులు

గోల్కొండ: శివపార్వతుల కల్యాణ మహోత్సవ ఉత్సవాలు సోమవారం ముగిశాయి. పద్మశ్రీ భవన్ సమితి తాళ్లగడ్డ, మార్కండేయనగర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ మహోత్సవాలు సోమవారం ముగిశాయి. ఈ కార్యక్రమంలో దావత్ నర్సింగ్, నందకిషోర్, రక్షిత్‌సాగర్‌తో పాటు బీజేపీ గుడిమల్కాపూర్ డివిజన్ అధ్యక్షులు జి.సునీల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఐ.ఎస్.సదన్ ఇన్‌స్పెక్టర్‌గా వెంకట రామయ్య


బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకట రామయ్య

సంతోష్‌నగర్: ఐ.ఎస్.సదన్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా మాగంటి వెంకట రామయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన ఎస్.మల్లేష్ బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో స్టేషన్‌లో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్.సైదయ్య ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు. సోమవారం పరిగి ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న మాగంటి వెంకట రామయ్యను ఐ.ఎస్.సదన్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేస్తూ నగర పోలీసు కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో మాగంటి వెంకట రామయ్య సోమవారం ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ ఎస్.సైదయ్య నుంచి బాధ్యతలు స్వీకరించారు.

మహిళా బిల్లు రూపకల్పనలో అంబేడ్కర్ ప్రతిపాదనలను పరిగణలోకి తీసుకోవాలి


మాట్లాడుతున్న డాక్టర్ కల్పన కన్నాభిరాన్

చార్మినార్: మహిళా బిల్లు రూపకల్పనలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రతిపాదనలను పరిగణలోకి తీసుకోవాలని ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త డాక్టర్ కల్పన కన్నాభిరాన్ అన్నారు. ప్రభుత్వ సిటీ కాలేజీ అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సోమవారం సిటీ కాలేజీ ఆడిటోరియంలో 'భారత దేశ సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులపై మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రభావం'అనే అంశంపై జరిగిన జాతీయ సదస్సులో ఆమె మాట్లాడారు. సామాజిక న్యాయ సూత్రాన్ని విస్మరిస్తే.. మహిళా రిజర్వేషన్ బిల్లుకు అర్థం లేదన్నారు. నిత్య శ్రామికులైన దళిత, బహుజన, గిరిజన మహిళల హక్కులను రక్షించే విధంగా ఈ రిజర్వేషన్ బిల్లు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య రమణ నాయక్, డాక్టర్ ఎజాజ్ సుల్తానా, డాక్టర్ విప్లవ దత్ శుక్లా, డాక్టర్ పావనీ, డాక్టర్ కృష్ణవేణి పాల్గొన్నారు.

మేడారం జాతరలో ప్లాస్టిక్‌ను నిషేధించాలి



సుల్తాన్‌బజార్: ప్రపంచ పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన సేవ్ మేడారం, క్లీన్ మేడారం, సే నోట్ ప్లాస్టిక్ వాల్‌పోస్టర్‌తో పాటు క్లాత్ బ్యాగ్‌లను ప్రపంచ పర్యావరణ సంస్థ గ్లోబల్ చైర్మన్ డాక్టర్ హరి ఇప్పనపల్లి, సంస్థ అధ్యక్షుడు డాక్టర్ సీహెచ్. భద్ర ఆధ్వర్యంలో సంస్థ ప్రధాన కార్యదర్శి నిఖిల్ సాయిలు సోమవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సంయుక్తంగా విడుదల చేశారు. అనంతరం డాక్టర్ హరి ఇప్పనపల్లి మాట్లాడుతూ..మేడారం పరిసర ప్రాంతాల్లో ఉన్న జీవ వైవిధ్యాన్ని, జీవులను, వృక్షాలను కాపాడుకోవాల్సిన బాధ్యత భక్తులపై ఉందన్నారు. నాలుగురోజుల పాటు లక్ష క్లాత్ బ్యాగ్‌లను జాతరలో పంపిణీ చేస్తామన్నారు. మేడారం భూమి సారవంతాన్ని ప్లాస్టిక్ వ్యర్థాలు దెబ్బతీస్తాయని భక్తులు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని కోరారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9010221230
9010463222
9553955684